నువ్వు పక్కనున్నప్పుడు
ఇచ్చే విలువ కంటే..
నువ్వు లేనప్పుడు
నీకు ఇచ్చే విలువే అవతలి వాళ్ల
మనసులో నీ స్థానం ఏంటో
తెలియజేస్తుంది

DD9 వార్త
తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 182 బుధవారం, 18, ఫిబ్రవరి 2026, పేజీలు - 06 వెల : 3/-

### ఇంటర్ హాల్‌టికెట్లు

# విడుదల

**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు ఈ నెల 18న విడుదలకానున్నాయి. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు కాలేజీ లాగిన్‌లో పొందుపరుచనున్నది. ఈ నెల 20న విద్యార్థులు/ తల్లిదండ్రుల రిజి స్టర్డ్ వాట్సాప్‌నకు హాల్‌టికెట్లను పంపిస్తా రు. బోర్డు వెబ్‌సైట్‌లోను హాల్‌టికెట్లను పొందు పరుస్తారు. విద్యార్థులు కాలేజీ లాగిన్ ఐడీ, ఇంటర్ వెబ్‌సైట్, వాట్సాప్‌నకు పంపించిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షకు అనుమతిస్తారు. పేరు, ఫొటో, సబ్జెక్టుల్లో తప్పులు దొర్లితే కాలేజీ ప్రిన్సిపాళ్లను సంప్ర దించి సవరించుకునే అవకాశం కల్పించారు. ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్‌కోడ్‌ను ముద్రి స్తున్నారు. పరీక్షకేంద్రం రూట్‌మ్యాప్‌తో అనుసంధానించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరుగు తాయి. 9,96,529 మంది పరీక్షలకు హాజరుకాబోతున్నారు.



## విశాఖకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**అమరావతి ఫిబ్రవరి 17 :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ పట్నానికి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్ డేగాకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్వాగతం పలికారు.విశాఖపట్నంలో జరగనున్న మిగతా2లో...

# కృత్రిమ మేధ కళ్లద్దాలు

### ●ఏఐ అద్దాలతో దర్శనమిచ్చిన ప్రధాని మోడీ

**ముంబై,ఫిబ్రవరి 17 :** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. కాగా...కృత్రిమ మేధ రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐని మిగతా2లో...





## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

### వ్యక్తి గురించి తెలుసుకోకుండా మోసపోతే ఎలా

### కేసు విచారణ సందర్భంగా సుప్రీం హితోక్తులు

**న్యూఢిల్లీ, 17 :** నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న మిగతా2లో...

### తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి

# సాంకేతిక హంగులు

### మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 :** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 -26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకా రులకు ఇష్టమైన సమాచార మిగతా2లో...

### లాటరీలో తొర్రూరును

# కొట్టేసిన కాంగ్రెస్

**● 7 సీట్లు మాత్రమే గెలిచినా వరించిన విజయం ● ఛైర్మన్‌గా శ్రవణ్ కుమార్ ఎన్నిక ● తొర్రూరు చేజారడంతో ఎర్రబల్లి కన్నీరు**



**మహబూబాబాద్,ఫిబ్రవరి 17 :** ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించు కోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, మిగతా2లో...



## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

**● పరీక్షకు హాజరైన 318 మంది విద్యార్థులు ● 100పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు ● 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించిన 28మంది విద్యార్థులు ● అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, 17 :** దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు.

### గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా

# హైదరాబాద్

**● నాణ్యమైన విద్యాసంస్థలకు నెలువుగా నగరం**
**● జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు**
**● రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం**
**● బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సిఎం రేవంత్**







**హైదరాబాద్,ఫిబ్రవరి 17 :** హైదరా బాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యా సంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబా ద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు.హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, మిగతా2లో...

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

### మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక

### అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం

### యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక

### ఆర్,ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ

### నెలాఖులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు

### హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 :** హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ




## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

### ఇంటర్నెట్ వాడడానికి నిషేధం

### కోర్టుక పాస్ పోర్టు సరెండర్

### విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు

**హైదరాబాద్,ఫిబ్రవరి 17 :** టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. మిగతా2లో...

### తెలంగాణ భవన్‌లో

# కెసిఆర్ జన్మదిన వేడుకలు

**● 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు ● తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల ● కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని ● ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 :** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ మిగతా2లో...

## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఏఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసిన ప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు.

## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటే రియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ ఆప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణి క్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహి ంచడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యా ర్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడా కారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారు లకు ఎప్పటి కప్పుడు సమాచా రాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంట ర్ ద్వారా 24 గంటల సమాచా రాన్ని క్రీడాకారులకు అందుబా టులో ఉంచడం అభినందనీయమని అన్నారు.

## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చ రించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి టైగర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి' గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్ర్యం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపి తగా ప్రజలు పిలుచుకు ంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మా త్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శు నకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళతెలంగాణలోపుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడు తున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్దిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్దిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్దిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్దిదారులను గుర్తించి ఆ లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్దిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్దిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగిం చాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇ టువంటి అరుదైన, కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి , బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఏఎస్, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

## విశాఖకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ( ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు ఆమె విశాఖకు చేరుకున్నారు. రేపు జరగనున్న కార్యక్రమంలో ఏపీ సీఎం నాయుడుతో పాటు రాష్ట్ర గవర్నర్, డిప్యూటీ సీఎం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ తదితరులు హాజరు కానున్నారు.

## కృత్రిమ మేధ కళ్లద్దాలు

(మొదటి పేజీ తరువాయి)

స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫోటోను షేర్ చేశారు. 'వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి' అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. 'ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది' అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ , సర్వం స్టూడియో సారస్ వీ3 ని తీసుకువచ్చింది.

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి, పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.ఈ కేసులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఒకరి గురించి పూర్తి సమాచారం లేకుండా అంతటి సాన్నిహిత్యం ఏర్పరచుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పెళ్లి పేరుతో జరిగే ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా ఛైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

## 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు
- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 17** : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# ఆదివాసీ సంస్కృతి ఔన్నత్యానికి అద్దం పట్టిన ఫ్యాషన్ షో




**డిడి9 వార్త గుడిహత్నూర్ మహారాష్ట్ర :** గోందియా జిల్లాలోని సడక్ అర్జుని గ్రామంలో ఇటీవల "గోండు రాజా గోండు రాణి ఆదివాసీ ఫ్యాషన్ షో 2026" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గోండు గిరిజనుల సంప్రదాయ వేషభూషణాలు, ఆభరణాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడిహత్నూర్ మండలం లోని తోషం గ్రామానికి చెందిన గోండు గాయకుడు, నృత్యకారుడు సోయం నరేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గోండు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. యువత తమ మూలాలను మరువకుండా సంప్రదాయ వేషధారణలను గౌరవించాలని సూచించారు. ఫ్యాషన్ షోలో చిన్నారులు, యువతులు సంప్రదాయ గోండు రాజా, గోండు రాణి వేషధారణలో ర్యాంప్‌పై నడిచి ప్రేక్షకులను అలరించారు. సాంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలు గిరిజనుల ఐక్యతను పెంపొందించడమే కాకుండా వారి కళా సంపదను ప్రపంచానికి పరిచయం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సోయం సుగుణ బాయి మేస్త్రం సాయి కుమార్ పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేశారు.

# లేబర్ అడ్డలో డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**కామారెడ్డి, ఫిబ్రవరి 17(డిడి9 వార్త):** జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో లేబర్ అడ్డ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యకమం నిర్వహించారు. జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్



నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 1930 ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఏపికే యాప్‌లు వంటి సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం వంటి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ పి.సి. సాయిలు మాటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైలీ లేబర్లు పాల్గొన్నారు.

# ఆహార కమిషన్ సభ్యుల కామారెడ్డి జిల్లా పర్యటన



**కామారెడ్డి, ఫిబ్రవరి 17(డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ హైదరాబాద్ సభ్య కార్యదర్శి, చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్య లు ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, శారద, భారతి, జ్యోతి లు ఈ నెల 20.02.2026 శుక్రవారం కామారెడ్డి జిల్లాను సందర్శించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్--2013 కింద అమలవుతున్న పథకాలపై క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి, సంబంధిత పౌర సరఫరాల సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యటన, సమీక్ష సమావేశం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామా : టీఆర్ఎస్ నాయకులు



**కోటగిరి, ఫిబ్రవరి 17(డీడీ9 వార్త):** తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి కోటగిరి మండల టీఆర్ఎస్ నాయకులు ప్రశంసలు కురిపించారు. మండల నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్, వల్లేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవానికి చిరునామాగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా కేసీఆర్ నిలిచారని కొనియాడారు. రైతు బంధు పథకంతో దేశానికి దారి చూపిన రైతు బాంధవుడిగా, ఉద్యమ సంకల్పంతో తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు మార్గదర్శకుడిగా కేసీఆర్ నిలిచారని పేర్కొన్నారు. దేశంలో లేని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లిన మహానేతగా ఆయనను అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మల్లేపల్లి శ్రీనివాసరావు, మండల టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి







**కామారెడ్డి, ఫిబ్రవరి 17(డిడి9 వార్త):** ప్రత్యేక సమగ్ర సవరణ నేపథ్యంలో మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఇందుకు గ్రామ పాలన అధికారులు మరియు ఇతర అధికారులను సహాయకులుగా నియమించాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వారి నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ పని చేయాలని, వారి పర్యవేక్షకులు మరియు ఏఈఆర్ఓలు సహకరించి ఎలాంటి పొరపాట్లకు తావుల కుండా ప్రక్రియను నిర్వహించాలన్నారు. అదేవిధంగా బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం--6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓలు వీణ, పార్థ నరసింహా రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో బన్సల్ విద్యార్థుల ప్రభంజనం




- రెండో ఏడాదే అద్భుత ఫలితాలు
- ఆకుల శ్రీహర్షకు 99.47 %
- విజేతలను సన్మానించిన విద్యావేత్త నరాల
- సుధాకర్, డైరెక్టర్ లక్ష్మణ్

**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నిజామాబాద్‌కు చెందిన బన్సల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. కళాశాల స్థాపించిన రెండో ఏడాదే జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తమవుతోంది. మంగళవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ ఫలితాల్లో ఆకుల శ్రీహర్ష 99.47 % సత్తా చాటగా.. రవితేజ 96.66%, నరసి ంహ 91.66 %, త్రిష 89.21 % సాధించి కళాశాల కీర్తిని చాటారు. ఈ సందర్భంగా విద్యావేత్త నరాల సుధాకర్ మాట్లాడుతూ.. ర్యాంకుల కోసం పిల్లలను హైదరాబాద్, విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు పంపాల్సిన అవసరం ఇకపై నిజామాబాద్ తల్లిదండ్రులకు ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. మన కళ్లముందే ఉండి ప్రపంచ స్థాయి ర్యాంకులు సాధించవచ్చని నిరూపించామన్నారు. కళాశాల డైరెక్టర్ మేకల లక్ష్మణ్ మాట్లాడుతూ.. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదలే ఈ విజయానికి కారణమని, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో నూ మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కో-డైరెక్టర్ జమున, అధ్యాపకులు అభిషేక్ తివారి, సురేంద్ర గోయల్, మనీష్ తివారి పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత



- నిజామాబాద్‌లో 163 దీచీూ సెక్షన్ అమలు
- పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు : సీపీ సాయిచైతన్య

**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** జిల్లాలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధమైంది. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు సీపీ పి.సాయి చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని మొత్తం 58 పరీక్షా కేంద్రాల వద్ద ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిషేధాజ్ఞలు కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమి కూడరాదు. పరీక్షలు జరిగే సమయాల్లో కేంద్రా లకు 200 మీటర్ల లోపు ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లను ఉదయం 8 గంటల నుండి మధ్యా హ్నం 1 గంట వరకు మూసివేయాలి. ఎవరూ కూడా ఆయుధాలు లేదా ఇతర ప్రమా దకర వస్తువులతో పరీక్షా కేంద్రాల వద్ద తిరగ రాదు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ప్రశాం తంగా పరీక్షలు రాసేలా ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని సీపీ కోరారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు






**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కమ్మర్ పల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు పండుగలా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తెలంగాణ అభివృద్ధి నమూనాను దేశానికి పరిచయం చేసిన నాయకుడు కేసీఆర్ అని నాయకులు కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు మాలవత్ ప్రకాష్, రెంజర్ల మహేందర్, కొత్తపల్లి అశోక్, రఘు, సుధాకర్, బాపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తా



**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన లుక్క గంగాధర్‌కు కమ్మర్‌పల్లి మండల సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. జిల్లా, రాష్ట్ర స్థాయి సమావేశాలకు ఫోటోగ్రాఫర్లు తప్పనిసరిగా హాజరై వృత్తిపరమైన అప్డేట్లను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ సంఘంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల అసోసియేషన్ ప్రతినిధులు వంగరి రవీందర్, సారా ప్రవీణ్, లింగమూర్తి మాట్లాడుతూ.. తమ మండల వ్యక్తికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు క్రాంతి, నాగేష్, ఉబేద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక





**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గాను నూతన బాధ్యులను సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా లుక్క గంగాధర్, ఉపాధ్యక్షుడిగా బోగా శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి పవన్ కుమార్, కోశాధికారిగా చిలువరి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా కొమ్ముల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. అసోసి యేషన్ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తూ క్లబ్ గౌరవాన్ని పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## పాఠశాలల మధ్య సమన్వయంతోనే విద్యా వికాసం

- సాలూర జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన బాపనయ్య నగర్ విద్యార్థులు
- స్కూల్ ట్విన్నింగ్ లో భాగంగా వినూత్న కార్యక్రమాలు






**బోధన్, నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, పాఠశాలల మధ్య బోధన అనుభవాల మార్పిడికి స్కూల్ ట్విన్నింగ్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని సాలూర జెడ్పీహెచ్ఎస్ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పురానే విజయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాలూర పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, ఎంపీపీఎస్ బాపనయ్య నగర్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా ప్రత్యేక మోటివేషన్ సెషన్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ గార్డెన్‌లను సందర్శించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. జీవశాస్త్ర నమూనాలు, మోడల్స్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాలూర విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పావని, సంధ్య, రాజేష్, శోభారాణి, జ్యోత్స్న, అరుణ్ కుమార్, గంధం సాయిలు, పీడీ సంగీత్రావు తదితరులు పాల్గొన్నారు.

## కారు అద్దం పగలగొట్టి రూ.8 లక్షల నగదు దొంగతనం

**బాన్సువాడ, ఫిబ్రవరి 17(డిడి9 వార్త):** కారులో ఉంచిన నగదు బ్యాగ్ దొంగతనానికి గురైన ఘటనపై బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం... హస్గుల్ గ్రామానికి చెందిన ఇబతి యాదవ్ రావు (తండ్రి: శంకర్) తన బంధువు మాధవరావుతో కలిసి బాన్సువాడలోని ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌కు వచ్చి తన ఖాతా నుండి రూ.8 లక్షలు నగదు ఉపసంహరించుకున్నారు. ఆ నగదును నల్లరంగు బ్యాగులో పెట్టి కారులో ఉంచి అనంతరం రిలయన్స్ మార్ట్‌కు వెళ్లారు. రిలయన్స్ మార్ట్ ప్రాంగణంలో కారును పార్క్ చేసి లోపలికి వెళ్లి షాపింగ్ చేసి తిరిగి వచ్చేసరికి కారు ఎడమ వైపు వెనుక డోర్ అద్దం పగలగొట్టబడినట్లు గుర్తించారు. కారులో పరిశీలించగా నగదు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా దొరకకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు వద్ద నుంచే అనుసరిస్తూ పార్కింగ్‌లో కారు అద్దం పగలగొట్టి నగదు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## గిర్నూర్లో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు





**బజార్ హత్నూర్, ఫిబ్రవరి 17(డిడి9వార్త న్యూస్):-** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల పరిధిలో ని గిర్నూర్ గ్రామపంచాయతీ కేంద్రంలోమంగళవారం రోజు ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రోజు పశువులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి సూదులు,మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిర్నూర్ గ్రామ సర్పంచ్ పూసల ప్రియాంక, ఉపసర్పంచ్ జి. రాజేందర్, డాక్టర్ పర్వేజ్ అహ్మద్,సిబ్బంది సి హెచ్ అరవింద్, ఠాకూర్ సూరజ్ సింగ్,పశుల యజమానులు తదితరులుపాల్గొన్నారు

## ఓటర్ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి

- జిల్లాల కలెక్టర్లతో సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పర్యటించాలి




**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** రాష్ట్రంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 వివరాలతో ప్రస్తుత సమాచారాన్ని సరిపోలుస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలని సూచించారు. రాజకీయ పార్టీలు కూడా ఏజెంట్లను నియమించుకుని ఈ ప్రక్రియకు సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ వల్ల మ్యాపింగ్ ప్రక్రియలో కొంత జాప్యం జరిగిందని, ఇకపై ప్రత్యేక దృష్టి సారించి త్వరలోనే పూర్తి చేస్తామని సీఈఓకు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించిన కలెక్టర్.. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, ఆర్డీవో రాజేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భీంగల్ మున్సిపల్ సారథులకు ఘన సన్మానం





**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** భీంగల్ మున్సిపాలిటీ నూతన సారథులకు మంగళవారం పట్టణంలో ఘన సన్మానం జరిగింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరె నాగలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ శాంతి లత, 11వ వార్డు కౌన్సిలర్ సంగ్య నాయక్లను భీంగల్ సేవాలాల్ సంఘం ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు భూక్యా లింబాద్రి మాట్లాడుతూ.. మహిళా నాయకత్వంలో భీంగల్ మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. వైస్ చైర్‌పర్సన్ శాంతి లత, కౌన్సిలర్ సంగ్య నాయక్ మాట్లాడుతూ వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుగులోత్ సురేష్, బోడ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత.. నిందితుడిపై కేసు జక్రాన్‌పల్లి పోలీసులకు అప్పగింత



**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడకల్ గ్రామంలోని ఒక రేకుల గదిలో అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీనిపై సీపీ, ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు పోలీసులు దాడులు నిర్వహించి మాక్లూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ మోహన్ ఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఉన్న 10 క్వింటాళ్ల పి.డి.ఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితుడిని జక్రాన్‌పల్లి ఎస్సైకి అప్పగించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

## బాల్య వివాహాల నివారణకు రథయాత్ర

- నిజామాబాద్‌లో అవగాహన యాత్ర ప్రారంభం
- నెల రోజుల పాటు పల్లె పల్లెకూ న్యాయ చైతన్యం



**నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బాల్య వివాహాల నివారణే ధ్యేయంగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ, సాధన ఎన్జీవో ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన రథయాత్ర మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మొదటి అడిషనల్ జేఎఫ్‌సీఎం ఖుష్బూ మాట్లాడుతూ.. జిల్లాలో నెల రోజుల పాటు సాగే ఈ రథయాత్ర ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, సంబంధిత శిక్షాస్మృతి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. బాల్యం చితికిపోకుండా ఉండాలంటే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. న్యాయ సహాయ రక్షణ మండలి ప్రతినిధులు మహమ్మద్ సాదుల్లా, రాజ్‌కుమార్ సుబేదార్‌లు న్యాయపరమైన అంశాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, న్యాయసేవా అధికార సంస్థ సిబ్బంది ఈ చైతన్య యాత్రలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్చార్జ్ అధికారి పద్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారి చైతన్య, సాధన సంస్థ సిబ్బంది మధుసూదన్, వినీష్, నిరీక్షణ తదితరులు పాల్గొన్నారు.

## పోతంగల్ రైతు వేదికలో వార్డు సభ్యులకు శిక్షణ



**పోతంగల్, ఫిబ్రవరి 17 (డీడీ8 వార్త):** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ ఐదు రోజులపాటు కొనసాగుతుందని ఎంపీడీవో చందర్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పిస్తూ వార్డు సభ్యుల విధులు, బాధ్యతలపై వివరంగా శిక్షణ అందించామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, నాగరాజు, శ్రవణ్ కుమార్ పాల్గొని వార్డు సభ్యులకు మార్గదర్శనం చేశారు.

## కొత్త వార్డు సభ్యులకు మొదటి విడత శిక్షణ ప్రారంభం










**బజార్ హత్నూర్, ఫిబ్రవరి, 17(డిడి9వార్త న్యూస్):-** బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలోమంగళవారం రోజు ఇటీవల కొత్తగా ఎన్నికయిన పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమంను 2 విడతలుగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మొదటి విడతగా మొదటి బ్యాచ్ కు ఒరియశీటల్ శిక్షణ ప్రారంభం చేశారు. ఈ నెల 17వ తేదీనుంచి నుంచి 21 వ తేదీ వరకు 5 రోజులుఈ ఒరియశీటల్ శిక్షణ కొనసాగుతుందని బజార్ హత్నూర్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.( పధానంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ముఖ్యంశాలు,గ్రామ పంచాయతీల విధులు బాధ్యతలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు బాధ్యతలు, గ్రామ పంచాయతీల స్థాయి సంఘాలు, పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలు, నియమ నిబంధనలు/నియంత్రణ అధికా రాలు, గ్రామ పంచాయతీ సమావేశంలుడ గ్రామ సభ, గ్రామ పంచాయతీల ఆర్థికవ్యవహారాల నిర్వహణ, గ్రామ పంచాయతీలో పారిశుద్యం,వన మహోత్సవశీ, వీధి దీపాల నిర్వహణ,గ్రామ పంచాయతీ పనుల నిర్వహణ, జనన మరణాలు వివాహల నమోదు,గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ద్వారా ఆదర్శ గ్రామం, గ్రామ పంచాయతీల ఖర్చులు, గ్రామపం చాయతీ రికార్డుల నిర్వహణ, ఆడిట్-సర్ చార్జీలు,గ్రామ పంచాయతీల సామాజిక తనిఖీ, ఈ పంచాయతీ అప్లికేషన్లు, పంచాయతీలు స్వయం సహాయక సంఘాల సమన్వయము, త్రాగునీరు సరఫరా, వి జి రాం జి (మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం,లే అవుట్ భవన అనుమతుల నియమాలు,సుస్థిర అభివృద్ధిలక్ష్యాలు-పంచాయతీల పాత్ర అను 24 అంశాలపైక్షుణ్ణంగా అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 31 గ్రామపంచాయతీలలో మొత్తం 244 మంది వార్డు సభ్యుల నుంచి మొదటి విడతలో 122 మంది సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్టు అధికారులు చెప్పారు. శిక్షణ బృందం సభ్యులు జి అనిల్ కుమార్, ఎల్. కుమార్, రవీందర్, శ్రీకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్ ఎంపీఓ మహేందర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సాలూర ఇన్చార్జి తహసీల్దారుగా అనూష

**బోధన్, నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** సాలూర మండల తహసీల్దార్ శశి భూషణ్ సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో ఇన్చార్జి తహసీల్దారుగా అనూషను నియమిస్తూ జిల్లా కలెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎడపల్లి మండలంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు సాలూర అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించి విధులు ప్రారంభించారు. మార్చి 2 వరకు ఆమె ఇన్చార్జిగా కొనసాగుతారని అధికారులు వెల్లడించారు. మండల ప్రజలకు రెవెన్యూ సేవల్లో ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు

## న్యూఅనంతపూర్లో పాఠశాల పనులు ప్రారంభం చేసిన ఎంపీ గోడం నగేష్



**బజార్ హత్నూర్,ఫిబ్రవరి, 17(డిడి9వార్త న్యూస్):-**ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మంగళవారం రోజు బజార్హత్నూర్ మండలంలోని న్యూ అనంతపూర్ గ్రామంలో టిడబ్ల్యూపీఎస్ నూతనపాఠశాల భవనంకు భూమి పూజచేసి పనులను ప్రారంభం చేశారు.రూపాయిలు 20 లక్షలు మంజూరు కాగా, ఈనిధులతో పనులు పూర్తి చేయనున్నారు.ఈ కార్యక్రమంలోఎంపీ నగేష్ తో పాటుగా బిజెపిరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపల్లి గంగాధర్ రావు, గ్రామ సర్పంచ్ సిడం మాన్కు,న్యూఅనంతపూర్ గ్రామపెద్దలు,నాయకులు,బీజేపీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## బండార్ పల్లిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



**బోధన్, నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ మండల పరిధిలోని బండార్ పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాడి సాయిలు కేక్ కట్ చేసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ నిండు నూరేళ్లూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుభాష్ పటేల్, వార్డు సభ్యులు మాధవరావు పటేల్, భూమయ్య, అబ్బయ్య, దిగంబర్ మరియు పార్టీ కార్యకర్తలు రెడ్డి సాయిలు, దాస్ పటేల్, చందూలాల్ పటేల్, పిరజి పటేల్, పాలకొండ లక్ష్మణ్, రమేష్, ప్రవీణ్, శంకర్ పటేల్, దత్తు, పోశెట్టి, రాములు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలిపై లైంగిక వేధింపులు: నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**- బోధన్ మండలంలో ఆటో డ్రైవర్ అఘాయిత్యం**

**- పోలీసుల తీరుపై విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ధ్వజం**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** బోధన్ మండల పరిధిలోని ఒక గ్రామంలో మానసిక దివ్యాంగురాలిపై ఓ ఆటో డ్రైవర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన సామాజిక వర్గాల్లో తీవ్ర కల కలం రేపుతోంది. అభాగ్యురాలైన మూగ, మానసిక దివ్యాంగురాలిని నిర్మా నుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడ ిగట్టడం అత్యంత హేయమని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మండిపడ్డారు. మంగ ళవారం ఆ గ్రామాన్ని సందర్శించిన విహెచ్‌పిఎస్ బృందం, బాధితురాలిని మరియు వారి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం సుజాత సూర్యవంశీ మీడియాతో మాట్లాడుతూ.. జరిగిన దారుణాన్ని వివరించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమాచారం కోరేందుకు బోధన్ రూరల్ ఎస్ఐని ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ అసభ్యకరమైన పదజా లంతో మాట్లాడారని సుజాత ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన రక్షక భటులే ఇలా ప్రవర్తించడం అమానుషమని, పోలీసుల తీరుపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కోరారు.

## శివునికి గంజాయి ప్రసాదం రంగంలోకి సీపీ సజ్జనార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** శివరాత్రి పర్వదినం వేళ గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. దేవాలయం వద్ద శివునికి గంజాయిని ప్రసాదంగా సమర్పించ బోయారు కొందరు ప్రబుద్ధులు. అంతేకాదు.. దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సదరు వ్యక్తుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయా న్ని నేరుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిష నర్ వీసీ సజ్జనార్‌కి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహా రంపై సీరియస్‌గా స్పందించిన సీపీ సజ్జనార్.. వీడియోలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

## చట్టం చుట్టమైందా అధికారుల కళ్లముందే ప్రతినిధుల మార్పిడి

**- ఎడపల్లి మండలంలో బట్టబయలైన పరిపాలనా వైఫల్యం**

**- సర్పంచ్ పతులకే పెద్దపీట.. ఎంపీడీఓ, ఎంపీఓల మౌనంపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 17ఫిబ్రవరి (డీడీ9 వార్త) :** ప్రభుత్వ నిబంధనలను తుచ తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత గల అధికారులే, చట్ట ఉల్లంఘనలకు వేదికగా మారడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఎడపల్లి మండల కేంద్రంలో సర్పంచ్ సంవిద యాప్ పై సర్పంచ్‌లకు నిర్వహించిన సమావేశంలో అధికారుల కళ్లముందే ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘన జరిగింది. మహిళా సర్పంచ్‌ల స్థానంలో వారి భర్తలు పాల్గొనడం ఒక ఎత్తయితే, దానిని అడ్డుకోవాల్సిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ప్రకారం, ఏ అధికారిక సమావేశానికైనా ఎన్నికైన ప్రతినిధి మాత్రమే హాజరుకావాలి. ఒకవేళ మహిళా సర్పంచ్‌లు రాకపోతే సమావేశాన్ని వాయిదా వేయడమో లేదా వారి గైర్హాజరును నమోదు చేయడమో చేయాలి. కానీ, ఎడపల్లి అధికారులు మాత్రం సర్పంచ్ పతులను సాదరంగా ఆహ్వానించి, వారితోనే చర్చలు జరపడం వారి విధి నిర్వహణలోని లోపాన్ని ఎండగడుతోంది. అసలు సర్పంచ్‌లు లేకుండా సమావేశాన్ని ఎలా నిర్వహించారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. సర్పంచ్ సంవిద్ ఈ-మొబైల్ అప్లికేషన్ అవగాహన కోసం ఈ సమావేశం నిర్వహించారు. ఈ యాప్‌లో లాగిన్ అవ్వడానికి, హాజరు నమోదు చేయడానికి సర్పంచ్‌ల అధికారిక గుర్తింపు తప్పనిసరి. ఎనిమిది మంది మహిళా సర్పంచ్‌లు రాకపోయినా, అధికారుల సమక్షంలో హాజరు ఎలా నమోదైంది? భర్తల సమక్షంలో యాప్ లాగిన్ ప్రక్రియను అధికారులు ఎలా పూర్తి చేశారు? ఇది ఫోర్జరీ కిందకు రాదా? ప్రభుత్వ రికార్డులను అధికారులు ఎలా తప్పుదోవ పట్టించారు? మహిళా ప్రజాప్రతినిధుల స్వతంత్ర అధికారాన్ని కాపాడాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. కానీ ఎడపల్లి మండల అధికారులు మాత్రం పురుష హేమాహేమీల ఒత్తిడికి తలొగ్గారా? లేక నిబంధనలపై వారికి అవగాహన లేదా? అన్న అనుమానాలు సామాజిక వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారుల ఈ ఉదాసీనత వల్ల మహిళా రిజర్వేషన్ల లక్ష్యం నీరుగారిపోతోంది. ఈ పరిణామంపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి తక్షణమే స్పందించాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలను గాలికి వదిలేసిన ఎంపీడీఓ, ఎంపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి షాడో పాలనకు అధికారులు సహక రించకుండా కఠినమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.



## తెలంగాణ జాతికి న్యాయం చేయాలనే సంకల్పం కేసీఆర్‌ను ముందుకు నడిపించింది

**హైదరాబాద్:** కేసీఆర్ తెలంగాణ కోసం జెండా ఎత్తినప్పటి పరిస్థితులను గుర్తు చేసుకుంటే కేసీఆర్ సాహసం, చరిత్ర తెలుస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ తెలంగాణ భవన్‌లో జరిగిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ కోసం ఉద్యమం ప్రారంభించినప్పుడు రాష్ట్రంలో ఓ వైపు టీడీపీ, మరొక వైపు నూరేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్, మరో జాతీయ పార్టీ బీజేపీ.. మూడు బలమైన రాజకీయ శక్తులను ఢీకొనాలంటే చాలా సాహసం కావాలి. ఒక రకంగా చెప్పాలంటే సాహసం కాదు, దుస్సాహసం. మీడియా పవర్ లేదు, మనీ పవర్ లేదు, మజిల్ పవర్ లేదు, కుల బలం లేదు, ధన బలం లేదు. ఆనాడు ఉన్నదల్లా ఒక్కటే.. తెలంగాణ జాతికి న్యాయం చేయాలనే సంకల్పం, ఆ తెలంగాణ నినాదంలో ఉన్న న్యాయం, ధర్మం.. ఇది మాత్రమే కేసీఆర్‌ను మొండి ధైర్యంతో, ఉక్కు సంకల్పంతో ముందుకు నడిపించినాయి. తర్వాత జరిగిన 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం మీకు తెలుసు, కేసీఆర్ త్యాగం మీకు తెలుసు, కేసీఆర్ పోరాటం తెలుసు, కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు ఉద్యమించి తెలంగాణ సాధించుకున్న తీరు కూడా ప్రజలకు తెలుసు. తదనంతరం 10 ఏళ్లు అద్భుతంగా రాష్ట్రాన్ని పరిపాలించారన్నా రు కేటీఆర్.ఆనాడు మాకు ఒకసారి ఒక సందర్భంలో అరుణ్ జైట్లీ చెప్పారు ఢిల్లీలో 'జనరల్ గా నాయకులు అయితే బెస్ట్ అజిటేటర్స్ (ఉద్యమకారులు) ఉంటారు లేదా మంచి అడ్మినిస్ట్రే టర్స్ (పరిపాలకులు) ఉంటారు. కానీ మీరు అదృష్టవంతులు అయ్యా, బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ కేసీఆరే, బెస్ట్ అజిటేటర్ కూడా కేసీఆరే. అది మీ అదృష్టం' అన్నారు. అట్లా 10 ఏళ్లు అద్భుతంగా రాష్ట్రాన్ని నడిపిన నాయకుడు కేసీఆర్, దేశానికి దిక్సూచిగా తెలంగాణను నిలిపిన నాయకుడు కేసీఆర్. కానీ ఈ మధ్యన, మరి మనం ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కొంతమంది మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చినట్టుగా మన నాయకుడిని తూలనాడుతున్నారు, ఇష్టం వచ్చినట్టుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు.జాతి మీద, జాతి గౌరవం మీద ఎవరు పడితే వాళ్లు మాట్లాడుతా ఉన్నారు. నేను వారికందరికీ ఒకటే చెప్తా



ఉన్నాతెలంగాణ మట్టితో మమేకమైన వాడికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వాడికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి అడుగు వేసిన వాళ్లకి మాత్రమే జాతి అంటే ఏంటో తెలుస్తుంది, జాతి గౌరవం అంటే ఏంటో తెలుస్తుందన్నారు కేటీఆర్.సకల జనులు స్వరాష్ట్ర సమరంలో తెగించి కొట్లాడుతున్నప్పుడు, ప్రాణాలకు తెగించి మన నాయకుడు నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు, సమైక్యాంధ్ర వాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలవదు, నీతి తెలవదు. లాఠీ దెబ్బలు తిన్నోళ్లకు, జైళ్లకు పోయినోళ్లకు, తుపాకులకు ఎదురుపడి నిలబడ్డోళ్లకు జాతి అంటే ఏంటి..? జాతి అస్తిత్వం అంటే ఏంటో తెలుస్తది..? ఉద్యమకారుల మీదికి తుపాకులు తీసుకొని ఆ రోజు దాడికి వెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎట్లా తెలుస్తది..? రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే, ఆత్మాభిమానం అనేది ఎక్కడన్నా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏందో, జాతి చరిత్ర అంటే ఏందో తెలుస్తది. కానీ జై తెలంగాణ నినాదం ఇయ్యడానికే భయపడేటోళ్లకు, కిరాయి సర్కార్‌కు తెలంగాణ సోయి లేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలవదన్నారు.జల్, జంగల్, జమీన్ అని కొట్లాడిన కొమురం భీముడి జాతి మాది.. అడుగుతున్నారు కొంతమంది.. కేసీఆర్ ఏ జాతికి నువ్వు జాతి పిత.. ఏ జాతి అని మాట్లాడుతున్నావు..? వాడికి నేను చెప్తా ఉన్నా,ఏ జాతి అని అవాకులు చెవాకులు పేలుతున్న అల్లుడికి, అల్లులకు చెప్తా ఉన్నా రాజ్యతంత్రం నడిపిన రాణి రుద్రమ్మ జాతి మాది.జల్, జంగల్, జమీన్ అని కొట్లాడిన కొమురం భీముడి జాతి మాది. అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క సారలమ్మల జాతి మాది.కోటల మీద జెండా ఎగరేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న జాతి మాది.భూస్వాముల దోపిడీ మీద పోరాడిన దొడ్డి కొమురయ్య జాతి మాది. బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ జాతి మాది. సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ జాతి మాది. సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగరేసిన తుర్రేబాజ్ ఖాన్ జాతి మాది. ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ జాతి మాది. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని చెప్పిన దాశరథి జాతి మాది.1952లో "గైర్ ముల్కీ గో బ్యాక్" అని నెత్తుటి త్యాగాలు చేసిన విద్యార్థి అమరవీరుల జాతి మాది.69లో కర్కశ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి 369 మంది అసువులు బాసిన యువ కిశోరాల జాతి మాది. మలిదశ ఉద్యమంలో ఢిల్లీ మెడలు వంచిన తెలంగాణ జాతి మాది. అణువణువునా ఆత్మగౌరవం తొణికిసలాడే జాతి మాది. నీతి ఉన్న, రీతి ఉన్న తెలంగాణ జాతి మాది. కానీ వాడికేం తెలుస్తది మన జాతి గురించి... వాడిలా ఢిల్లీకి సలాం కొట్టి బతికే సామంతులం మేము కాదు. నిటారుగా నిలబడ్డ వెన్నెముక ఉన్న తెలంగాణ భూమి పుత్రులం, ఆ జాతి మాది. సామంతుల జాతి కాదు స్వతంత్రుల జాతి మాది. బానిసకు ఒక బానిసకు ఒక జాతి కాదు, గిరి గీసి కొట్లాడే తెగువ ఉన్న కేసీఆర్ జాతి మాది. ఢిల్లీకి ఇస్తే ఎగిరే కీలుబొమ్మల జాతి కాదు మాది. అధిష్టానం ఆడిస్తే ఆడే తోలుబొమ్మల జాతి కాదు మాది. తెగువ ఉన్న, పౌరుషం ఉన్న భూమి పుత్రుల జాతి మాది. కిరాయి వాళ్ల పంచన చేరి కిరాయి బతుకు బతికే జాతి కాదు మాది. సోయి ఉన్న, సొంత శక్తి ఉన్న జాతి మాదని కేటీఆర్ అన్నారు."ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత?" అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి ఫైటర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి'గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. .

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు : హైకోర్టు స్టేతో మారిన సమీకరణాలు

**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి17 :** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియ దాదాపు పూర్తయిన తరుణంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులతో ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అదృశ్యం కావడమే ఈ ఎన్నిక వాయిదాకు కారణంగా తెలుస్తోంది. తన తండ్రిని ఎవరో కిడ్నాప్ చేశారని యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని ఎల్లుండి తమ ముందు హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు చైర్మన్ ఎన్నికపై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.కౌన్సిల్ హాల్లో అనూహ్య పరిణామాలు..ఒకవైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే, ఇబ్రహీంపట్నం కౌన్సిల్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్‌కి చెందిన టేకుల సుదర్శన్ రెడ్డిని 15 మంది కౌన్సిలర్లు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. ఈ క్రమంలో కిడ్నాప్ అయ్యారని భావించిన కౌన్సిలర్ యాదగిరి.. ఎన్నిక ప్రక్రియ ముగిసిన వెంటనే అనూహ్యంగా కౌన్సిల్ హాల్లో ప్రత్యక్షమయ్యారు. సరిగ్గా చైర్మన్ పేరును అధికారికంగా ప్రకటించాల్సిన సమయంలో హైకోర్టు స్టే ఉత్తర్వులు అందడంతో అధికారులు ఇబ్రహీంపట్నం ఎన్నికను నిలిపివేశారు.




## ఎర్రబెల్లి దయాకర్ రావు కంటతడి లాటరీలో కాంగ్రెస్‌కు వరించిన అదృష్టం!

**తొర్రూరు :** తెలంగాణలోని తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నిక నేడు (ఫిబ్రవరి 17, 2026) తీవ్ర ఉత్కంఠ మధ్య ముగిసింది. హోరాహోరీగా సాగిన ఈ రాజకీయ పోరులో అనూహ్య పరిణామాల మధ్య కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తన రాజకీయ ఇలాకాగా భావించే తొర్రూరులో మున్సిపాలిటీ చేజారడంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు.బలాబలాలు సమానం -- లాటరీతో నిర్ణయంతొర్రూరు మున్సిపాలిటీలోని మొత్తం 16 వార్డులకు గాను బీఆర్ఎస్ 9 వార్డుల్లో, కాంగ్రెస్ 7 వార్డుల్లో విజయం సాధించాయి. అయితే, కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్-అఫీషియో ఓట్లు తోడవడంతో కాంగ్రెస్ బలం 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు 9-9తో సమానం కావడంతో అధికారులు లాటరీ పద్ధతిని ఆశ్రయించారు. అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్‌ను వరించడంతో ఆయన చైర్మన్‌గా ఎంపికయ్యారు.ఎర్రబెల్లి భావోద్వేగం -- పోలీసుల అరెస్ట్ఈ ఫలితం వెలువడిన వెంటనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ కడియం కావ్యకు ఇక్కడ ఎక్స్-అఫీషియో ఓటు హక్కు లేదని, నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించారని ఆయన ఆరోపించారు.మరోవైపు.. తొర్రూరు మున్సిపల్ ఆఫీస్ దగ్గర బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్ అఫీషియో మెంబర్‌గా అనర్హురాలంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ తమను బెదిరించారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు.కంటతడి: "రేయింబవళ్లు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలి?" అంటూ మీడియా సాక్షిగా ఆయన ఏడ్చేశారు.అరెస్ట్: ఎన్నికల కేంద్రం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆందోళనకు దిగడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని నర్సింహులుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



# మలయాళంలో తొలి అడుగు




## సినిమాల్లోకి ఖుష్బూ కూతురు..

ఒకప్పటి స్టార్ హీరోయిన్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ కుమార్తె అవంతిక సుందర్ వెండితెర అరంగేట్రానికి సిద్ధమయ్యారు. ఆమె మలయాళ చిత్ర పరిశ్రమ ద్వారా హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు. ఆమె నటిస్తున్న తొలి చిత్రానికి 'ఆరంభం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఇటీవలే త్రిశూర్‌లోని చావక్కాడ్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 35 ఏళ్ల క్రితం 1991లో ఖుష్బూ సైతం మోహన్ లాల్ సరసన 'అంకుల్ బన్' అనే మలయాళ చిత్రంతోనే ఆ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఇప్పుడు ఆమె కూతురు అవంతిక కూడా తల్లి బాటలోనే నడవడం విశేషం. ఈ కొత్త చిత్రంలో అవంతిక 'ఆరతి' అనే పాత్రలో కనిపించనున్నారు. సుజేష్ అన్నీ ఈపెన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టూడియో బెల్లారూహ్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఇందులో ఇంద్రన్స్, విజయరాఘవన్, అల్తాఫ్ సలీం, కళాభవన్ షాజోన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను మలయాళంతో పాటు తమిళంలోనూ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. గోపీ సుందర్ సంగీతం, అజయ్ విన్సెంట్ ఛాయాగ్రహణం అందిస్తుండగా, రాజు సుందరం కొరియోగ్రఫీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కున్నంకుళం, చావక్కాడ్ పరిసర ప్రాంతాల్లో వేగంగా జరుగుతోంది.

# ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు ఎదురుదెబ్బ



ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు దశాబ్దాలుగా సినీ ప్రపంచాన్ని, అభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఆయన సొంత పాటలపై హక్కుల కోసం జరుగుతున్న చట్టపరమైన పోరు ఇప్పుడు కీలక మలుపు తీసుకుంది. ఢిల్లీ హైకోర్టు తాజాగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇళయరాజాకు ప్రతికూలంగా మారాయి. 1976 నుంచి 2001 మధ్య కాలంలో ఇళయరాజా సంగీతం అందించిన 134 సినిమాల ఆడియో హక్కులు ప్రముఖ ఆడియో సంస్థ 'సరిగమ'కే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. నాటి చిత్ర నిర్మాతలు ఈ హక్కులను శాశ్వతంగా సరిగమకు అమ్మేశారని, కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజాకు యాజమాన్య హక్కులు లేవని జస్టిస్ తుషార్ రావు గెడేలా తీర్పు ఇచ్చారు. ఈ వివాదం 'ఎప్ ఇనియా పొన్ నిలవే' వంటి ఆల్‌టైమ్ హిట్ సాంగ్‌తో మొదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా అనుమతులు ఇవ్వగా సరిగమ సవాల్ చేసింది. "నిర్మాత వద్ద వేతనం తీసుకుని కంపోజ్ చేసిన పాటలపై హక్కులు నిర్మాతకే చెందుతాయి. ఈ క్రమంలో ఆ హక్కులు సరిగమకు బదిలీ అయ్యాయి" అని కోర్టు స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేసే అవకాశాన్ని ఇళయరాజాకు కోర్టు కల్పించింది.

# చిన్న సినిమాకు అదిరిపోయే కలెక్షన్లు



టాలీవుడ్‌లో కంటెంట్ ఆధారిత ప్రేమ కథలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుంది. ఆ జాబితాలో తాజాగా చేరిన చిత్రం కపుల్ ఫ్రెండ్లీ. సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన ఈ హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లతో దూసుకెళ్తోంది. రిలీజైన మొదటి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 5.42 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించడం ద్వారా ఈ సినిమా తన సత్తాను చాటుకుంది. ఒక చిన్న సినిమాకు రూ.5.42 కోట్ల గ్రాస్ అంటే చిన్న విషయమేమీ కాదు. ఈ మూవీలో సెన్సిటివ్ లవ్ స్టోరీని ఆధునిక సంబంధాల నేపథ్యంలో చూపించిన విధానం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా థియేటర్లకు రప్పించడంలో కపుల్ ఫ్రెండ్లీ విజయవంతమైంది. ముఖ్యంగా ఎమోషనల్ సీన్స్, నేచురల్ యాక్టింగ్, మ్యూజిక్..ఇవన్నీ సినిమాకు బలంగా నిలవగా, ఈ మూవీకి ఇండస్ట్రీలోకి పలువురు ప్రముఖులు సైతం ప్రశంసలు కురిపించడం విశేషం. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ లాంటి సెలబ్రిటీలు కపుల్ ఫ్రెండ్ టీమ్‌ను అభినందించడం ఈ మూవీకి మరింత బజ్ ను తీసుకొచ్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించగా, అజయ్ కుమార్ రాజు కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు.

# ఆరోగ్య సమస్యల వల్ల సినిమాలకు దూరమయ్యా

రంగుల ప్రపంచంలో బతికే చాలా మంది సినీ సెలబ్రిటీల జీవితాలు అందరూ అనుకున్నంత కలర్ ఫుల్ గా ఏమీ ఉండవు. చాలా మంది సెలబ్రిటీల జీవితాల్లో ఏదో ఒక వెలితి, విషాదం, అసంతృప్తి ఉంటాయి. చాలా మంది వీటిని బయటపెట్టుకోవడానికి ఇష్టపడరు. కొందరు మాత్రం తమ అనుభవాలను ధైర్యంగా పంచుకుంటారు. అలాంటి వారిలో రేఖ వేదవ్యాస్ ఒకరు. 2001లో విడుదలైన 'ఆనందం' సినిమాతో రేఖ ఒక ఊపు ఊపింది. తన క్యూట్ లుక్, నటనతో ఆమె ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా విజయంతో ఆమెకు వరుసగా అవకాశాలు వచ్చాయి. తెలుగుతో పాటు, కన్నడ, తమిళ భాషల్లో కూడా నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొన్నేళ్ల తర్వాత ఆమెకు వరుసగా పరాజయాలు ఎదురు కావడంతో ఆమె క్రమంగా కనుమరుగు అయింది. 2012 తర్వాత ఆమె టాలీవుడ్ లో కనిపించలేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... తన జీవితంలో దాగి ఉన్న కష్టాలు, ఆరోగ్య సమస్యలు, పెళ్లి ఆలోచనలు... ఇవన్నీ చాలా ఓపెన్‌గా, భావోద్వేగంగా పంచుకుంది.



గత కొన్నేళ్లుగా శారీరకంగానూ, మానసికంగానూ చాలా కుంగిపోయానని, ఆరోగ్య సమస్యల వల్లే సినిమాలకు దూరమయ్యానని రేఖ ఆవేదన వ్యక్తం చేసింది. పెళ్లి విషయంలో మొదట్లో ఆసక్తి లేకపోయినా... తర్వాత మనసు మారి పెళ్లి చేసుకోవాలనుకున్నానని చెప్పింది. కానీ తన ఆరోగ్య పరిస్థితిని చూసి ఎవరూ ముందుకు రాకపోవడం బాధ కలిగించిందని భావోద్వేగంగా తెలిపింది. "తొందరపడి పెళ్లి చేసుకుని విడాకుల వరకు వెళ్లే బంధాల కంటే... ఆలస్యమైనా మంచి సంబంధం రావాలని ఆశిస్తున్నాను" అని చెప్పింది. ఇండస్ట్రీ ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని... ఎన్నో కష్టాలు

# సౌత్ నుంచి వచ్చానని తక్కువగా చూశారు

సౌత్ సినీ ఇండస్ట్రీలో పేరు ప్రతిష్టలు సంపాదించిన తర్వాత బాలీవుడ్ లోకి వెళ్లి అక్కడ కూడా సత్తా చాటాలని చాలా మంది నటీనటులు అనుకుంటూ ఉంటారు. కానీ ఒక ఇండస్ట్రీ నుంచి మరో ఇండస్ట్రీకి వెళ్లినప్పుడు ఎవరికైనా అక్కడి పరిస్థితులు, పని చేసే విధానం, వాతావరణం ఎప్పుడూ సులభంగా అనుకూలించవు. ఈ నేపథ్యంలోనే సౌత్ నుంచి నార్త్ కు వెళ్లిన వాళ్లు పలు ఇబ్బందులు పడుతుంటారు. బాలీవుడ్ లో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి ఇప్పటికే పలువురు కామెంట్స్ చేయగా, తాజాగా రెజీనా కసాండ్రా హిందీ చిత్ర పరిశ్రమలో తనకు ఎదురైన అనుభవాల గురించి మాట్లాడి చర్చల్లో నిలిచారు. దశాబ్దానికి పైగా తెలుగు, తమిళ సినిమాల్లో నటించిన రెజీనా, 2019లో ఏక్ లడకీ కో దేఖా తో ఐసా లగా అనే సినిమాతో హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టారు. బాలీవుడ్ లో తన ప్రయాణం తాను ఊహించినంత సులభంగా సాగలేదని, హిందీ భాషపై తాను పూర్తి పట్టు కలిగి ఉన్నా, మాట్లాడటంతో పాటూ హిందీ రాయగలిగినా, వేరే సినిమాల్లో ఇతర హీరోయిన్లలాగా తాను డబ్బింగ్ ఆర్టిస్టులను వినియోగించుకోకపోయినా, తన డబ్బింగ్ తానే స్వయంగా చెప్పుకున్నప్పటికీ, బాలీవుడ్ లో తాను పూర్తిగా కలిసిపోయాననే ఫీలింగ్ కలగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సౌత్ నుంచి వచ్చిన నటిగా తనను కొందరు వేరేలా చూశారని, తన నేపథ్యాన్ని తక్కువ చేసి చూసిన సందర్భాలు కూడా ఎదురయ్యాయని రెజీనా తెలిపారు. కొందరి ప్రవర్తన, మాట్లాడే తీరు తనను అసౌకర్యానికి గురి చేసిందని, అవన్నీ తనను ఒక బయటి వ్యక్తిలా చూపించేవని, వేరే పరిశ్రమ నుంచి వచ్చానని భావించి కొందరు తనను దూరంగా పెట్టారని కూడా రెజీనా వ్యాఖ్యానించారు.

అయితే బాలీవుడ్ మొత్తం అలాంటిదే కాదని కూడా రెజీనా ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. అందరూ ఒకేలా ఉండరని, తనకు మద్దతుగా నిలుస్తూ, గౌరవించిన వాళ్లు కూడా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. కొత్త వాతావరణం, కొత్త పని విధనం, కొత్త వ్యక్తులతో కలిసి వర్క్ చేయడం మొదట్లో భయాన్ని, టెన్షన్ ను కలిగించిందని చెప్పిన రెజీనా, పని చేసిన ప్రతీ ఇండస్ట్రీలోనూ తాను సౌకర్యవంతమైన వాతావరణాన్ని సృష్టించుకోవడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. ఒకసారి ఒక రకమైన పాత్రలో కనిపిస్తే, అదే ఇమేజ్ పడిపోతుందని, ఇండస్ట్రీలో మహిళల విషయంలో ఇదెక్కువగా కనిపిస్తుందని, అందుకే కమర్షియల్ సినిమాలకే పరిమితమవకుండా, విభిన్న పాత్రలు చేయాలనే తపన తనలో ఎప్పుడూ ఉంటుందని ఆమె చెప్పారు. 16 ఏళ్ల వయసులోనే నటిగా కెరీర్ ను స్టార్ట్ చేసిన రెజీనా, ఇప్పుడు 35 ఏళ్ల వయసులో తన అనుభవాలతో ఎంతో నేర్చుకున్నట్టు చెప్తున్నారు. ఇండస్ట్రీలో ఉండటం అంత ఈజీ కాదని, తాను చాలా కూల్ పర్సన్ అయినప్పటికీ కొన్నిసార్లు మనసులోని అనుభవాలు మనపై ప్రభావం చూపుతాయని, నేర్చుకుంటూ, మర్చిపోతూ, మళ్లీ నేర్చుకుంటూ కెరీర్లో ముందుకెళ్తున్నానని రెజీనా చెప్పుకొచ్చారు. మొత్తానికి రెజీనా ఎన్ని సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ, టాలెంట్ కు లిమిట్స్ ఉండవని ప్రూవ్ చేస్తున్నారు.



# ఆ అనుభవం ఇప్పుడు పనికొచ్చింది



వరుస ప్రయోగాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సుహాస్ ఇప్పుడు పూర్తి స్థాయి వినోదాత్మక పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం హే బల్‌వంత్ ఫిబ్రవరి 20న విడుదలకు సిద్ధమవుతోంది. మొదట హే భగవాన్ పేరుతో ప్రారంభమైన ఈ సినిమాకి సెన్సార్ సూచనల మేరకు టైటిల్‌ను మార్చారు. భగవాన్ అనే పదానికి ధార్మిక అర్థం వచ్చే అవకాశం ఉందని భావించి, కథా కాన్సెప్ట్‌ను పరిగణనలోకి తీసుకుని హే భగవంత్ గా డిసైడ్ చేసినట్టు సుహాస్ తెలిపారు. చిత్ర ప్రమోషన్స్ లో యాక్టివ్ గా పాల్గొంటున్న సుహాజ్ తాజాగా మీడియా ముందుకొచ్చి ఈ సినిమా గురించి, తన నెక్ట్స్ ప్రాజెక్టుల గురించి పలు విషయాలను వెల్లడించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి నిర్మించారు. బన్నీ వాస్, వంశీ నందిపాటి కలిసి సమర్పిస్తున్న ఈ సినిమాలో శివానీ నగరం హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పూర్తి స్థాయి అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ మూవీ తన కెరీర్‌లోనే ఫాస్ట్ గా పూర్తైన సినిమా అని సుహాస్ వెల్లడించారు.

చిన్నప్పటి నుంచే బిజినెస్ చేయాలని కలలు కనే ఓ యువకుడి కథే ఈ సినిమా అని, తండ్రి వ్యాపారాన్ని టేకపే చేయడానికి ప్రయత్నించే సమయంలో ఎదురయ్యే సంఘటనలే కథకు మూలంగా ఉంటాయని, ఎంటర్టైన్మెంట్ తో పాటు ఎమోషన్స్ కు కూడా చోటు ఇచ్చిన ఈ కథ తనను వెంటనే ఆకట్టుకుందని సుహాస్ అన్నారు. సినిమా తాము ఊహించిన దానికంటే వంద రెట్లు బాగా వచ్చిందని, ఈ సినిమా తనకు సక్సెస్ ను అందిస్తుందని నమ్ముతున్నట్టు సుహాస్ చెప్పారు.